ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



చిత్తూరు జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025

వంద టెంకాయలు రూ.2,500

రికార్డుస్థాయికి చేరిన కొబ్బరి ధర



పాలసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి కాయల ధర రికార్డుస్థాయికి చేరుకున్నాయి. వంద కొబ్బరికాయలను రైతుల వద్ద రూ.2,500లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పాలసముద్రం మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో విస్తారంగా కొబ్బరి తోటలున్నాయి. రెండు నెలలుగా కొబ్బరి ధరలు పెరుగుతూ ప్రస్తుతం వంద రూ.2,500లకు చేరుకున్నాయి. రెండు నెలల కిందట వంద కొబ్బరి కాయలు రూ.15,00 పలికేవి. అదే రెండేళ్ల కిందట అయితే రూ.800-850 మధ్య ధరలు ఉండేవి. తమిళనాడు, కేరళ, మన రాష్ట్రంలో కొబ్బరి తోటలకు పిండెనల్లి తెగులు కారణంగా దిగుబడి తగ్గింది. దీనివల్లే ధరలు పెరిగినట్లు సమాచారం. మండలం నుంచి కొబ్బరికాయలను తమిళనాడులోని చెన్నై, కాంచీపురం, రాణిపేట, తిరుత్తణి, షోలింగర్ వంటి ప్రాంతాలతో పాటు మహారాష్ట్రకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ఎండు కొబ్బరి కిలో రూ.250 ధర పలుకుతోంది. ఎప్పుడూ లేని విధంగా ఈ స్థాయిలో ధరలు పలుకుతుండటంతో కొబ్బరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వైభవంగా ఆడిపదునెట్టు ఉత్సవం



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి - క్రేన్‌కు వేలాడుతున్న భక్తులు

కుప్పం/కుప్పం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వానగుట్టపల్లె పంచాయతీలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో ఆడిపదునెట్టు వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయమే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణలు చేశారు. విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి బాలసుబ్రహ్మణ్య స్వామి వారికి పూలకావళ్లు సమర్పించారు. వీపులకు కొక్కేలు గుచ్చుకుని క్రేన్లకు ప్రత్యేకంగా అమర్చిన నిర్మాణాలకు వేలాడుతూ భక్తులు ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు చేశారు. అలా వేలాడుతూనే స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వరకు వేడుకలు సాగాయి. స్వామివారికి రథోత్సవంతో వేడుకలు ముగిశాయి.



చిత్తూరు రెండవ డిపో గ్యారేజ్‌లో బస్సు మరమ్మతులను పరిశీలిస్తున్న ఈడీ చంద్రశేఖర్

ఉచిత ప్రయాణానికి సన్నద్ధం

- 82 బస్సులకు కొత్త రూపు
- కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాకు 103 కొత్త బస్సులు
- మరో వంద బస్సులకు ప్రతిపాదన
- బస్టేషన్లలో మౌలిక వసతుల ఏర్పాటు
- ఆగస్టు 15 నుంచి అమలు లాంఛనమే

చిత్తూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన మరో ప్రధాన హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చ జెండా ఊపిన నేపథ్యంలో అధికారులు ఆగమేఘాలపై ఏర్పాట్లు చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని 5 డిపోల్లో మౌలిక వసతుల కల్పన, మహిళల ప్రయాణానికి అనుగుణంగా బస్సుల్లో మార్పులు, అవసరమైన అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీనిపై ఇటీవల విజయవాడలో ఆర్టీసీ జిల్లా అధికారులతో ఎండీ సమావేశం కూడా నిర్వహించారు.

● బస్సులకు మరమ్మతులు

ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టిన కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ముందస్తు సన్నద్ధత లేక మహిళలు నరకం చూశారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇక్కడ అన్ని విధాలా సిద్ధమవుతున్నారు. చిరిగిన సీట్లు, పగిలిన కిటికీలకు మరమ్మతులు చేస్తున్నారు. రంగులు వేసి బస్సుల కండీషన్ చెక్ చేసి సమస్యలుంటే పరిష్కరిస్తున్నారు. పూర్తిగా గుల్లయిన బస్సుల బాడీలు మార్చేస్తున్నారు.జిల్లాలో ఇప్పటి వరకు 18 బస్సుల బాడీలు మార్చారు. ఇంకా కొన్నిటిపై కసరత్తు చేస్తున్నారు. ఇవి కాకుండా 24 బస్సుల్లో 3+2 గా ఉన్న సీట్ల స్థానంలో 2+2 చేసి ఎక్కువమందికి సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళల తాకిడి ఎక్కువగా ఉండే ఉదయం 8-11గంటల మధ్య, సాయంత్రం 4-7 గంటల మధ్య సర్వీసులు పెంచాలన్న అంశంపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య రెండు రెట్లు పెరిగినా ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

● 24 బడి బస్సులు రోజంతా నడిపే ఏర్పాట్లు

జిల్లాలో విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా 24 బస్సులు ఉదయం, సాయంత్రం మాత్రమే నడిపేవారు. ఉచిత ప్రయాణం మొదలైతే ఈ బస్సులను రోజంతా ప్రయాణికులను చేరవేసేందుకు నడపనున్నారు. ఉచితాన్ని అమలు చేస్తే 50 శాతం అదనంగా మహిళలు ప్రయాణించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.ఇందుకు అనుగుణంగా అన్ని బస్సుల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు పూర్తి చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

జిల్లాలో ఆర్టీసీ	
డిపోలు	5
మొత్తం బస్సులు	464
పల్లెవెలుగు	209
ఏసీ బస్సులు	4
సూపర్ లగ్జరీ	30
సప్తగిరి ఎక్స్‌ప్రెస్	33
ఎక్స్‌ప్రెస్	102

● మౌలిక సదుపాయాలు సిద్ధం

ఆర్టీసీ డిపోల్లోని బస్సు స్టేషన్లలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు వంటి సౌకర్యాల కల్పన దాదాపు పూర్తయింది.నీళ్ల ట్యాంకులకు, కొళాయిలకు అవసరమైన రిపేర్లు చేస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు కుర్చీలు, ఉక్కపోత లేకుండా కొత్త ఫ్యాన్లు అమర్చారు. టీవీలకు మరమ్మతులతో పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.

● మరో వంద బస్సులు కావాలి

జిల్లాలో రోజూ 708 గ్రామాలకు సుమారు 164 రూట్లల్లో ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయి. రోజుకు 1.31 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 40 శాతం మంది అంటే 52 వేల మంది మహిళలులున్నారు. జిల్లాలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 103 కొత్త బస్సులు జిల్లాకు వచ్చాయి. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణాన్ని దృష్టిలో పెట్టుకొని అదనంగా మరో 100 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

● రోజుకు రూ.42 లక్షల ఆదాయం

జిల్లాలో ఆర్టీసీకి టికెట్ల ద్వారా రోజుకు రూ.42 లక్షలు ఆదాయం వస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణం అమలైతే 40 శాతం ఆదాయానికి గండిపడనుంది. అయితే ఈ లోటు పూడ్చేందుకు ఆర్టీసీ అధికారులు వివిధ ఆదాయ మార్గాలను ఆలోచిస్తున్నట్లు డీపీటీవో రాము తెలిపారు. . ఆర్టీసీ కార్గో సేవలను మెరుగుపరచడం, బస్టాండ్‌లో ఖాళీ స్థలాలు లీజుకు ఇవ్వడం,లగ్జరీ, అల్ట్రా లగ్జరీ బస్సుల శాతాన్ని పెంచడం వీటిలో కొన్ని.

● 344 బస్సుల్లో ప్రయాణం ఉచితం

జిల్లాలోని 464 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని 344 బస్సుల్లో అమలు చేయనున్నారు. ఇందులో 209 పల్లెవెలుగు బస్సులు,102 ఎక్స్‌ప్రెస్‌లు ,33 సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతించనున్నారు.

కుటుంబ భారం తగ్గుతుంది



పూల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రోజూ మావూరి నుంచి పూలకోసం చిత్తూరుకు వస్తుంటా. ఇక్కడ పూలు దొరకలేదంటే వేలూరుకో, పలమనేరుకో వెళ్లి తెచ్చుకొని కట్టి అమ్ముకుంటా.నెలకు రూ.2 వేలకు పైనే బస్సు ఛార్జీలకు ఖర్చవుతుంది. చంద్రబాబు చెప్పినట్లు ఆడోళ్లను ఆర్టీసీలో ఫ్రీగా పంపిస్తే ఆ 2 వేలు పొదుపు చేసుకుంటా.

-మునిలక్ష్మి, అట్లవారిపల్లె, పెనుమూరు మండలం

తిరునగరికి తగ్గనున్న ట్రాఫిక్ సమస్య

విమానాశ్రయానికి పెరగనున్న కనెక్టివిటీ

రూ. 113 కోట్లతో ఎన్‌హెచ్ పనులకు శంకుస్థాపన

తిరుపతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ. 113 కోట్లతో రెండు నేషనల్ హైవేస్ ప్రాజెక్టు పనులకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం మంగళగిరి నుంచీ సీఎం చంద్రబాబుతో కలసి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మదనపల్లె-నాయుడుపేట రోడ్డు బైపాస్ సెక్షన్‌కు సంబంధించి ఎన్‌హెచ్ 71లో తిరుపతి నగర శివార్లలో 22 కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల కింద రోడ్డు మార్కింగ్, ట్రాఫిక్ సైన్ బోర్డులు, సోలార్ బ్లింకర్లు వంటివి ఏర్పాటు చేయాల్సి వుంది.తిరుపతి వెలుపల పూతలపట్టు-నాయుడుపేట రోడ్డును మదనపల్లె - తిరుపతి రోడ్డును కలిపే ఈ రోడ్డు పనులు పూర్తయితే తిరుపతి నగరంపై మదనపల్లె వైపు నుంచీ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. మదనపల్లె వైపు నుంచీ వచ్చే వారు రేణిగుంట రైల్వే జంక్షన్‌కు, విమానాశ్రయానికి త్వరగా చేరుకోగలుగుతారు. ప్రయాణ వ్యవధితో పాటు కాలుష్యం కూడా తగ్గుతుంది. కాగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద, తడ-నెల్లూరు ఎన్‌హెచ్ 16వ సెక్షన్‌లో చిల్లకూరు సెంటర్ వద్ద రెండు కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ. 91 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ రెండు చోట్లా ఫోర్ లేన్ స్థాయిలో రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. ఆ పనుల్లో భాగంగా ఆరు చోట్ల బాక్సు కల్వర్టులు, రెండు చోట్ల పైప్ కల్వర్టులు, ఒక బస్ షెల్టర్ నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గనున్నాయి. కృష్ణపట్నం పోర్టుకు, షార్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రయాణ వ్యవధి, కాలుష్యం తగ్గుతాయి. ముఖ్యంగా స్కూలు పిల్లలకు, పాదచారులకు రోడ్డు ప్రమాదాల నుంచీ భద్రత కలగడమే కాకుండా చిల్లకూరు, శ్రీసిటీ జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి.

రేపు వైద్యఆరోగ్యశాఖ మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒకరోజు పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి తిరుపతి నుంచి సోమవారం ఉదయం రోడ్డుమార్గాన బయల్దేరి తొమ్మిది గంటలకు కార్వేటినగరం మండలం పసలవానిమిట్ట గ్రామం చేరుకుంటారు. స్థానికంగా జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 10.45 గంటలకు చిత్తూరు మండలం ఈడిగపల్లె గ్రామానికి చేరుకుని నూతనంగా ఏర్పాటుచేసిన హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పాలసముద్రం చేరుకుని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు తిరుపతికి బయల్దేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

మణీంద్రం ఎంపీటీసీ ఎన్నిక ఏకగ్రీవం?

వైసీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

రామకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికల నామినేషన్ల పరిశీలన శనివారం జరిగింది.మణీంద్రంకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి భార్య విశాలాక్షి సమర్పించిన నామినేషన్ పత్రాల్లో ప్రతిపాదించే వారు సంతకం చేయాల్సిన చోట విశాలాక్షి సంతకం చేయడంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. వైసీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి కుమార్తె అర్పిత ఆస్తులకు సంబంధించి పూర్తి వివరాలు పొందుపరచకపోవడం, రామకుప్పంలోని భవనాలకు సంబంధించి పన్ను బకాయి ఉండడంపై ఫిర్యాదులు రావడంతో ఆమె నామినేషన్‌ను కూడా తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. నామినేషన్ల తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఆదివారం కుప్పం ఆర్డీవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు.అప్పీళ్లపై సోమవారం తుదినిర్ణయం ఉంటుందన్నారు.అయితే నామినేషన్ల పరిశీలన అనంతర పరిస్థితులు చూస్తుంటే మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.టీడీపీ మద్దతుదారు విశాలాక్షి, వైసీపీ అభ్యర్థి అర్పిత నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించడంతో ప్రస్తుతానికి అరుణ ఒక్కరే బరిలో మిగిలారు. నామినేషన్ల పరిశీలనకు వైసీపీ అభ్యర్థి అర్పిత గాని.. ఆమెను ప్రతిపాదించిన వారు గాని హాజరు కాకపోవడం చూస్తుంటే ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే అప్పీలు కార్యక్రమానికి హాజరవడం అనుమానమేనని భావిస్తున్నారు. ఇదే జరిగితే మణీంద్రం ఎంపీటీసీ టీడీపీ కైవసమవుతుంది.

25 'విండోల' పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):జిల్లా పరిధిలోని 25 అఫిషియల్, నాన్ అఫిషియల్ సింగిల్ విండోల పదవీకాలం జనవరి 30 వరకు లేదా ఎన్నికలు జరిగేంతవరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సహకార శాఖ అధికారుల ఆధ్వర్యంలో వున్న చవటగుంట, పాలసముద్రం, గంగాధరనెల్లూరు, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, పలమనేరు, రొంపిచెర్ల సింగిల్ విండోల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. వీటితో పాటు ఇటీవల అనధికార త్రిసభ్య కమిటీలుగా ఏర్పడిన వాటిలో 18 సింగిల్ విండోల పదవీకాలాన్ని పొడిగించింది. చంద్రశేఖరపురం, వి.కోట, ముదరందొడ్డి, గంగవరం, పెద్దపంజాణి, సోమల, చౌడేపల్లె, చిత్తూరు, గుడిపాల, యాదమరి, ఐరాల, పూతలపట్టు, ఎర్రచెరువుపల్లె, నగరి, రామకుప్పం, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం సింగిల్ విండోల పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరునెలల పాటు పొడిగించింది.





అన్నదాత సుఖీభవ చెక్కుతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టరు సుమిత్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి - నగదు అందుకున్న రైతుల ఆనందం

రైతు రాజుగా ఎదగాలి

- ముఖ్యమంత్రి లక్ష్యం అదేనన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- 2,05,753 మంది రైతుల ఖాతాల్లో రూ.138.16కోట్లు జమ

రొంపిచెర్ల,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయంలో రైతు రాజుగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.అన్నదాత సుఖీభవ పథకం కింద శనివారం జిల్లాలోని 2,05,753 మంది రైతులకు రూ.138.16 కోట్లు జమయ్యాయి.ఇందుకు సంబంధించి రొంపిచెర్లలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రైతులకు నమూనా చెక్కు అందజేశారు.అంతకుముందు ఎద్దుల బండిపై పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలసి సభాస్థలికి మంత్రి చేరుకున్నారు.సభలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబానికి 10 పథకాల లబ్ధి చేరుతోందన్నారు. కలెక్టరు సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అన్నదాతలకు గతంలో రూ.13 వేలు ఇచ్చేవారని, ప్రస్తుతం రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ 20వేలు ఇస్తున్నారన్నారు.జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏడీ శివకుమార్, ఏవో శ్రావణి, కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, సోమల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, బీజేపీ నాయకుడు మాదాల లోకేష్, టీడీపీ నాయకులు ముల్లంగి రమణ, ధనంజయ నాయుడు, మురళీ నాయుడు, మోహన్ నాయుడు, చిన్నబాబు, మణియాదవ్, రమేష్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, జనార్దన్, కొండా మురళి, నాగరాజు, రవికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించండి

కలెక్టరేట్ వద్ద టీచర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనుల నుంచి టీచర్లకు విముక్తి కల్పించి, పాఠాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరోత్తమరెడ్డి మాట్లాడుతూ.. చదువుకోవడానికి బడికి వచ్చే పిల్లలకు దుస్తులు, భోజనాన్ని అందించి పైఅధికారులకు లెక్కలు చెప్పడానికే సమయం సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్ల బదిలీలు జరిగి 45 రోజులవుతున్నా ఇంతవరకు జీతాలు రాలేదన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో మోహన్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. జిల్లా అధ్యక్షుడు మణిగండన్, సెక్రటరీ మునీరహ్మద్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, పలువురు నేతలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై 5న సమావేశం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈనెల ఐదో తేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ నేతృత్వంలో వివిధశాఖల అధికారులతో సమావేశం జరగనుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈ సమావేశంలో 21 రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈవో కార్యాలయ భవనం వద్ద ఉన్న సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి జిల్లా, మండలస్థాయి అధికారులు, ఆలయ ఉభయదారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్ఠ భద్రత ఉండాలి : ఎస్పీ



సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్ఠ భద్రత ఉండాలని ఎస్పీ మణికంఠ చెప్పారు. ఆయుధాలతో భద్రతా సిబ్బంది ఉండాలన్నారు. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ భద్రతలపై శనివారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాత్రివేళల్లో ప్రధాన బ్యాంకుల వద్ద రొటేషన్ పద్ధతిలో గార్డులను నియమించుకోవాలన్నారు. బీట్ కానిస్టేబుళ్లు రాత్రి సమయాల్లో గార్డుల అప్రమత్తతను పరిశీలించాలన్నారు. ప్రతి బ్యాంకులోనూ ఫైర్ డిటెన్షన్ అండ్ అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ వ్యవస్థపై జరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో బ్యాంకులు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే తెలియజేసేలా లింకింగ్ మెకానిజం ఉండాలన్నారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, కుప్పం డీఎస్పీ పార్థసారథి, ఎల్‌డీఎం హరీష్, బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ మేనేజర్లు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సుహాస్


డ్రమ్స్ శివమణి, ఆది, అశ్విన్‌బాబు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ హీరోలు ఆది, అశ్విన్‌బాబు, సుహాస్, సంగీత దర్శకుడు తమన్, డ్రమ్స్ శివమణి, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారులు ఎల్లా వెంకటేశ్వరరావు, తానా మాజీ అధ్యక్షుడు వీ సతీష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందని వచ్చా


వచ్చేవారం నుంచి తాను తమిళంలో నటించబోతున్నానని, ఈ క్రమంలో స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో తిరుమలకు వచ్చానని హీరో సుహాస్ తెలిపారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల్లో తమిళ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు.

కోదండరాముడికి స్వర్ణ తులసిహారం బహూకరణ

తిరుపతి అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామికి శనివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన దాత బంగారు తులసీహారం బహూకరించారు. రూ.26లక్షల విలువైన 257గ్రాముల పసిడితో తులసిదళాలు, వాటిపై గాయత్రి బీజాక్షరాలు పొందుపరిచారు. ఈ హారాన్ని దాత ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నకు అందజేశారు. విశేష ఉత్సవాలలో మూలవర్లకు దీన్ని అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆనందకుమార్‌దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.


హారంతో డిప్యూటీ ఈవో నాగరత్న

సర్వ దర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,353

తలనీలాలు సమర్పించినవారు: 25,636

అభిమానుల్లో ఉండే ఎనర్జీ నాలోనూ ఉంది

● 'కూలీ' ట్రైలర్ రిలీజ్ వేడుకలో రజనీకాంత్



చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అభిమానుల్లో ఉండే ఎనర్జీ తనలోనూ ఉందని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఆయన హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'కూలీ' చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక శనివారం రాత్రి చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు, సత్యరాజ్‌కు అభిప్రాయభేధాలుండొచ్చు, కానీ ఆయన మనసులో వచ్చిన మాటను నిర్మొహమాటంగా చెప్పి వెళ్లిపోతుంటారు. మనసులో ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారిని నమ్మొచ్చు. కానీ, మనసులో ఒకటి, బయట ఒకటి పెట్టుకుని వుండేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మకూడదు' అన్నారు. 'ఎన్ని రోజులని నేను మంచిగా నటించాలి' అని హీరో అజిత్ కుమార్‌కు దర్శకుడు వెంకట్ ప్రభు ఒక డైలాగ్ రాశాడు. ఆ విధంగానే ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున ఒక పాత్రలో నటించారు' అని రజనీకాంత్ అన్నారు.అనంతరం అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, 'ఒక కూలీ వంద బాషాలకు సమానం. నిజమైన సూపర్‌స్టార్ రజనీకాంత్. ఓజీ సూపర్‌స్టార్ అంటే రజనీకాంత్. యూ ఆర్ ది సూపర్ స్టార్ ఆఫ్ ది ఇండియన్ సినిమా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు లోకేష్ కనకరాజ్ మాట్లాడుతూ, 'నా తండ్రి ఒక బస్సు కండక్టర్. ఆయన నంబరు 1421. ఆ నెంబరును ఈ సినిమాలో రజనీకాంత్‌కు ఉపయోగించాను. ఇది నా తండ్రికి నేను ఇచ్చే ఒక గౌరవంగా భావిస్తున్నా' అన్నారు.హీరోయిన్ శృతి హాసన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నాకు ఒక మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు లోకేశ్‌కు ధన్యవాదాలు. మా నాన్నకు 'విక్రమ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీని ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఆ చిత్రం నుంచి నేను మీ అభిమానిగా మారిపోయాను' అన్నారు. ఈ ఆడియో వేడుకల్లో బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14వ తేదీన తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్‌కానుంది.

ఫ్యాన్స్ అత్యుత్సాహం.. స్వల్ప తోపులాట : 'కూలీ' ఆడియో రిలీజ్ వేడుక జరిగిన నెహ్రూ ఇండోర్ స్టేడియం వద్ద రజనీకాంత్ అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు.వేడుకను తిలకించేందుకు పాసులున్నవారిని మాత్రమే అనుమతించారు. అయితే, పెద్ద ఎత్తున ఫ్యాన్స్ స్టేడియం వద్దకు చేరుకుని లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో అభిమానులంతా ఒక్కసారిగా ముందుకు తోసుకు వెళ్ళడంతో స్వల్ప తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్ కూడా కిందపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. పరిస్థితిని చక్కదిద్దారు.

నేడు స్నేహితుల దినోత్సవం



స్నేహం చూపిన ఔదార్యం

● ఎస్వీ వైద్య కళాశాలకు బాసట

తిరుపతి(వైద్యం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వారంతా కలిసి చదువుకున్నారు. కాలం గడుస్తున్నా వారి స్నేహం చెక్కు చెదరలేదు. ఎక్కడెక్కడో ఉన్నా అప్పుడప్పుడయినా కలుస్తున్నారు. నాటి సంగతులను కలబోసుకుంటున్నారు. గురువులను సత్కరిస్తున్నారు. అక్కడితో ఆగిపోలేదు. తమను ఒక్కటి చేసిన స్నేహబంధం వారిలో సేవా దృక్పథాన్ని పెంచింది. తమను ఉన్నత స్థాయికి చేర్చేందుకు బాటవేసిన విద్యాలయాభివృద్ధికి చేతులు కలిపేలా చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీ వైద్య కళాశాలకు చెందిన కొందరు పూర్వ విద్యార్థులు కళాశాలకు బాసటగా నిలుస్తున్నారు. స్నేహితులుగా సేవా సుమాలను పూయిస్తున్నారు.


రూ.15 లక్షలతో కళాశాల క్రీడామైదానానికి ప్రహరీ, పెవిలియన్ నిర్మించిన 1991 బ్యాచ్ విద్యార్థులు


రూ. 5 లక్షలతో ఫార్మకాలజీ విభాగానికి ఫర్నిచర్‌ను అందజేసిన 2004 బ్యాచ్ స్నేహితులు

● ఎస్వీ వైద్య కళాశాలలో 2004లో వైద్య విద్యను పూర్తి చేసిన పలువురు ఇప్పటికే స్నేహ బృందంగా ఏర్పడ్డారు. అప్పుడప్పుడూ కళాశాలకు వస్తూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కళాశాలకు ఆర్థికపరంగా చేయూత అందిస్తున్నారు. ఇటీవల ఫార్మకాలజీ విభాగానికి అవసరమైన రూ.5 లక్షల విలువచేసే బీరువాలను, కంప్యూటర్లను అందజేశారు.

● కళాశాలలో 1991లో వైద్య విద్యను పూర్తి చేసిన మరో కొందరు విద్యార్థులు ఇప్పటికీ స్నేహాన్ని కొనసాగిస్తూ కళాశాలపై ఉన్న మమకారం చాటుకుంటున్నారు. భవిష్యత్తు తరాల విద్యార్థుల కోసం రూ.15 లక్షలతో కళాశాల క్రీడా మైదానానికి ప్రహరీని, పెవీలియన్‌ను నిర్మించి ఔదార్యాన్ని ప్రకటించారు.

● 1987, 1995 బ్యాచ్ విద్యార్థులు కూడా స్నేహితుల సమూహంగా ఏర్పడ్డారు. కళాశాలలోని విద్యార్థులను కలిసేందుకు వచ్చే తల్లిదండ్రులు వేచి ఉండేందుకు అవసరమైన రెండు ప్రత్యేక గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు అందజేశారు. అవసరమైన పూర్తి ఫర్నీచర్‌ను సమకూర్చారు.

● కళాశాలకు చెందిన 1993 బ్యాచ్ స్నేహితులు రూ.2 లక్షలతో కళాశాలలో బోరును, 2004 బ్యాచ్‌లో స్నేహితులుగా మారిన మరికొందరు రూ.4 లక్షలతో కళాశాలలోని ఈఎన్‌టీ విభాగానికి అవసరమైన వైద్య పరికరాలను అందజేశారు. కళాశాల హితంకోరే స్నేహితులుగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.


రూ. 15 లక్షలతో రెండు గదుల నిర్మాణానికి చేయూతనిచ్చిన (1987, 1995 బ్యాచ్) స్నేహితుల బృందం


రూ.2 లక్షలతో 1993 బ్యాచ్ విద్యార్థులు కళాశాలలో బోరు వేయిస్తున్న దృశ్యం

దారి తప్పితే దండన తప్పదు

● నేర సమీక్షలో ఎస్పీ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేసేవారు దారితప్పి ప్రవర్తిస్తే దండన తప్పదని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో శనివారం జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలలతో పోలిస్తే గ్రేవ్ కేసులు, దొంగతనాలు కొంత తగ్గుముఖం పట్టాయని ఎస్పీ చెప్పారు. తీవ్ర నేరాల కేసుల(గ్రేవ్) ఛేదన సమయంలో ప్రణాళికాబద్ధంగా వెళితే సులువుగా ఫలితాలు రాబట్టవచ్చన్నారు. నెలాఖరులోగా పెండింగ్ గ్రేవ్ కేసుల విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పూర్తి స్థాయిలో విచారించాక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసుల విచారణకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఇళ్ల చోరీ కేసులు తగ్గుముఖం పట్టాయని, ఇటీవల దాదాపు 75 మంది పాత నేరస్థులను అరెస్టు చేశామని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వైట్ కాలర్, సైబర్ క్రైం నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోపిడీ, దారి దోపిడీ కేసుల పెండింగ్‌పై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంధ్య, కేదారినాథ్, జయశేఖర్, ప్రేమసాగర్, నిర్మల, కుమారి, శిరీష, అదనపు ఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో జాతీయ పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

వడమాలపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట ఉన్నత పాఠశాల క్రీడాకారులు వెండి పతకాలు సాధించారు.జూలై 26 నుంచి 30వ తేదీ వరకు జాతీయ గ్రాప్లింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చేతన్ సాయి(9వ తరగతి) 50 కిలోల విభాగంలో, ప్రణతి(8వ తరగతి) 34 కిలోల విభాగంలో ప్రతిభ చూపి వెండి పతకాలను సాధించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాణం తీసిన ఈత సరదా


అక్షిత్(ఫైల్ ఫొటో)

వెంకటగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసిన ఘటన పట్టణంలోని అమ్మవారిపేట చెరువులో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని అరవపాళెంకు చెందిన అరవ మధు, మోహనమ్మ కుమారుడు అక్షిత్(13) స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలలో భోజనం తర్వాత స్నేహితులతో కలిసి అమ్మవారిపేట చెరువులో ఈతకు వెళ్లాడు. ఈతకొట్టే క్రమంలో విద్యార్థులు ప్రమాదంలో ఉండటంతో స్థానికంగా చేపలు పట్టేవారు గమనించి కాపాడారు. అక్షిత్ కనిపించకపోవడంతో స్కూల్‌కు వెళ్లిపోయి ఉంటాడని భావించి అందరూ మిన్నకుండిపోయారు. సాయంత్రమైనా ఆ బాలుడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారించారు. అందరూ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చెరువు వద్ద పరిశీలించగా అక్షిత్ మృతదేహం తేలుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీలు వేయకుండా సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడు

● అటెండర్ తిరుమలేష్ ఆరోపణ

రేణిగుంట ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డ్యూటీలు వేయకుండా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడని ఆ కార్యాలయ అటెండర్ తిరుమలేష్ ఆరోపించారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కార్యాలయంలో తాను చేయాల్సిన పనులను ప్రైవేటు వ్యక్తుల చేత చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు రికార్డు రూమ్‌లోని బీరువా తెరిచి రికార్డులను పరిశీలిస్తుంటారని, డాక్యుమెంట్ నెంబర్లు రాస్తుంటారని తెలియజేశారు. తనకు తపాలా విధులు ఇచ్చి ప్రైవేటు వ్యక్తుల చేత ఎలా పనిచేయించారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిని వివరణ కోరగా విధుల్లో భాగంగా అప్పగించిన పనులను సిబ్బంది చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే సిబ్బంది కొరతతో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన సెల్వరాజ్

వరదయ్యపాళెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని పెద్దపాండూరు గ్రామానికి చెందిన సెల్వరాజ్ (22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు.శనివారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా నక్కలమిట్ట వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని వెంటనే స్థానికులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మృతుడు వరదయ్య

వడమాలపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాదిరేడు బైపాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో మహిళ తీవ్ర గాయాలపాలైంది. పాదిరేడుకు చెందిన వరదయ్య(65) వడమాలపాట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు బైపాస్ రోడ్డు దాటు తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న లారీ ఢీకొంది. వరదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వసంతకు చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడింది. 108లో వారిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వరదయ్య మృతిచెందాడు. వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఐజీ గోపీనాథ్ జెట్టికి పితృవియోగం

ఓజిలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డీఐజీ గోపీనాథ్‌జెట్టి తండ్రి జెట్టి పుల్లయ్య (72) శుక్రవారం రాత్రి తిరుపతిలో మృతి చెందారు.ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఓజిలి మండలం కరబల్లవోలుకు శనివారం తీసుకువచ్చారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఓజిలి మండలం సగుటూరు ఎంపీటీసీగా పుల్లయ్య సేవలు అందించారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు ఐపీఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సందర్శించి నివాళులర్పించారు. కరబల్లవోలులోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుడు బళ్లారి రాఘవాచారికి డీఆర్వో నరసింహులు ఘన నివాళి అర్పించారు. రాఘవాచారి జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ రాఘవాచారి తెలుగు నాటక రంగానికి విశేష సేవలు అందించారని తెలిపారు.

ఘనంగా శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం


విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న సతీష్‌రెడ్డి

● హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి

సత్యవేడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీలో శనివారం 9వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జీ.సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వీ.కార్తికేయన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల గవర్నింగ్ బోర్డు సభ్యులు, శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, సెనేట్ సభ్యులు హాజరయ్యారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ కోయంబత్తూరు టెక్స్‌టైల్స్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందన్నారు. ఇక్కడ విద్యా, పారిశ్రామిక వ్యవస్థ కలిసి అభివృద్ధి చెందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రయోజనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్తికేయన్ వార్షిక నివేదికను సమర్పించారు. విద్య, పరిశోధన, క్రీడా రంగాలలో సంస్థ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో 309 మందికి బీటెక్ పట్టాలను, 9 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో 18 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు ప్రదానం చేయగా మరో ముగ్గురికి బంగారు పతకాలు అందించారు.

ఘనంగా ఎంబీయూ స్నాతకోత్సవం

చంద్రగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం(ఎంబీయూ)లో శనివారం కాన్వకేషన్, గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు అధ్యక్షతన ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ అందరూ గొప్పవారు కాలేరని, కష్టపడేతత్వం కలిగిన వారే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారనిన్నారు. ఎంబీయూ ఛాన్సలర్ మోహన్ బాబు మాట్లాడుతూ ప్రఫుల్ పటేల్ గొప్ప విద్యావేత్త అని కొనియాడారు. మహారాష్ట్రకు చెందిన లోక్మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్డా విద్యావేత్తగా, నేషనల్ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రిగా చేసిన సేవలను గుర్తుచేశారు. ఎంబీయూ ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1698 మందికి గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకున్నట్లు తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, డ్రమ్స్ శివమణితో పాటు మహారాష్ట్రకు చెందిన లోక్మత్ పత్రిక అధినేత విజయ్ జవహర్ దార్డాకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. దేశంలోనే ప్రముఖ వ్యక్తులకు డాక్టరేట్ ఇచ్చామని ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ సారథి, డీఎఫ్ఏ రవిశేఖర్, సీజీఎస్ఐ వికాస్ సింగ్, డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.


శివమణికి గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న మోహన్‌బాబు

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

● అధికారులకు సీవీఎస్వో ఆదేశం

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రానున్న బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయన విజిలెన్స్, ఫైర్, ఎస్పీఎఫ్ అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సమావేశమయ్యారు. సీవీఎస్వో మాట్లాడుతూ.. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తిరుమలలోని ప్రతి ప్రాంతంపైనా నిఘా ఉంచుతూ భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు సీఎం పట్టువస్త్రాల సమర్పణ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ప్రణాళికబద్ధంగా రూపొందించాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



కానిస్టేబుల్ పరీక్షలో.. వికసించిన పేదింటి కుసుమం


రిచా

కేవీబీపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వారిది పేద కుటుంబం. తండ్రి లేడు. తల్లి కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను చదివించింది. గత ఏడాది కుమారుడు సూర్య ఆర్మీకి ఎంపికయ్యాడు. ఇప్పుడు కుమార్తె రిచా కానిస్టేబుల్‌గా ఎంపికైంది. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబరిచిన మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన మేరీ కుమార్తె రిచాను గ్రామస్తులు అభినందించారు. పట్టుదలతో అన్నాచెల్లెలు ఉద్యోగాలు సాధించారంటూ కొనియాడారు.

సెప్టెంబరు 25 వరకు ప్రత్యేక రైళ్ల కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖపట్నం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు సెప్టెంబరు 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో తెలిపారు. ఈ ప్రత్యేక రైలు(08547) విశాఖపట్నంలో ప్రతి బుధవారమూ బయలుదేరుతుందని, ఈ ప్రత్యేక రైలు(08548) తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరి రాకపోకలు సాగిస్తుందని వివరించారు.

పింఛన్ల పంపిణీ ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారని దాడి

పుంగనూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పంపిణీ చేసి వాట్సాప్ గ్రూపుల్లో ఆ ఫొటోలు పోస్టు చేశారని టీడీపీ నాయకుడిపై శుక్రవారం రాత్రి దాడి జరిగిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు... పుంగనూరు మండలం బండ్లపల్లెకి చెందిన టీడీపీ నాయకుడు చిన్నరెడ్డెప్ప, మరికొందరు నాయకులు ఒకటో తేదీ సచివాలయ అధికారులతో కలిసి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఆ ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో తమ కుటుంబ సభ్యులకు పింఛన్లు ఇచ్చిన ఫొటోలు ఎందుకు పోస్టు చేశారని, పింఛన్లు ఇవ్వడానికి మీరెవరంటూ ప్రత్యర్థులు దాడికి పాల్పడ్డారు. కారంపొడి, రాళ్లతో ఇంటిపైకి వచ్చి దుస్తులు చించి కొట్టారు. అర్ధరాత్రి పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరి తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై బండ్లపల్లెకి చెందిన ఉదయ్‌భాస్కర్, విష్ణువర్ధన్, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డిలను శనివారం బైండోవర్ చేసుకొని తహసీల్దార్ రాము ఎదుట హాజరుపరిచినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

5 నుంచి పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని డాక్టర్ వైసీ జేమ్స్‌యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్లకు ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కళాశాలలోని మెకానికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచిలకు ఎన్‌బీయే గుర్తింపును 2028 సంవత్సరం వరకు పొడించినట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణులై, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే విద్యను అభ్యసించి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జతల జిరాక్సు పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకు రావాలన్నారు. అలాగే ప్రవేశ రుసుం, ప్రాసెసింగ్ రుసుం స్పాట్ అడ్మిషన్ రోజునే చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ● కేఈసీలో: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సుల్లో మొదటి సంవత్సరానికి గాను ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సు కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫీజుతో అడ్మిషన్లకు హాజరు కావాలని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్‌నంబర్ 9542423396 ను సంప్రదించాలని కోరారు.

ఈవీఎం గోదాముల తనిఖీ


రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఈవీఎం గోదాములను తనిఖీ చేస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మితమైన రెండు ఈవీఎం గోదాములను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి డీఆర్వో మోహన్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. హమాలీల సహకారంతో ఎన్నికల సామగ్రిని నియోజకవర్గాల వారీగా వరుసక్రమంలో అమర్చాలని, గోదాములను శుభ్రంగా ఉంచాలని ఎన్నికల అధికారులకు సూచించారు. చిత్తూరు ఆర్డీవో శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్, అట్లూరి శ్రీనివాసులు, ఉదయ్ కుమార్, యశ్వంత్, పరదేశి, సురేంద్రబాబు, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటితరం నటులకు బళ్లారి రాఘవ ఆదర్శం


రాఘవ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రంగస్థలం నాటకానికి బళ్లారి రాఘవ విశిష్ట సేవలు అందించారని జేసీ విద్యాధరి కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాఘవ జయంతి కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. నేటితరం నటులకు రాఘవ ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. గాంధీజీతో పాటు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌లచే నటనతో శభాష్ అనిపించుకున్న నటుడని తెలిపారు. సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర అమలుకై సంతకాల సేకరణ

మామిడి రైతుల సంక్షేమ సంఘం


సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర అమలు కోసం రైతుల నుంచి సంతకాల సేకరణ చేయనున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆనందనాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్దన్, హరిబాబు తెలిపారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. మామిడి గిట్టుబాటు ధరపై ముఖ్యమంత్రి ఆదేశాలను జిల్లాలోని గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపులు అమలు చేయడం లేదని విమర్శించారు. దీన్ని నిరసిస్తూ సోమవారం నుంచి ఈనెల పదో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 50వేల మంది రైతుల నుంచి సంతకాల సేకరణ, 11వ తేదీన చిత్తూరు గాంధీ విగ్రహం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. నిరసనలో రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మునీశ్వర్, భారతి, మురళి, సందీప్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ అందని గాండ్లపల్లె పంచాయతీ

డబ్బు డ్రా చేసి కన్పించకుండా పోయిన కార్యదర్శి

పూతలపట్టు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం దళవాయిపల్లె గ్రామానికి చెందిన గోపి యాదవ్ పూతలపట్టు మండలం గాండ్లపల్లె పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఈ పంచాయతీలోని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయడానికి అవసరమైన రూ.2.36 లక్షలను బ్యాంకు నుంచి డ్రా చేసి, కనిపించకుండా పోయాడు. రెండ్రోజులుగా పింఛను ఇవ్వకపోడంతో లబ్ధిదారులు మండలస్థాయి అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు ఆ కార్యదర్శికి ఫోన్ చేస్తే స్విచాఫ్ అయ్యిందని చెబుతున్నారు.

లారీ ఢీకొట్టడంతో కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు

ముగ్గురు నెల్లూరువాసులకు గాయాలు


కంటైనర్ కింద ఇరుక్కున్న కారు - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

బంగారుపాళ్యం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో కంటైనర్ కిందకు ఓ కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు నెల్లూరువాసులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న కారును శనివారం ఉదయం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్‌లోకొచ్చేసరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. అదుపుతప్పిన కారు పక్కనే వెళుతున్న కంటైనర్ కిందకు దూసుకెళ్లి ఇరుక్కుంది. వాహనం ధ్వంసమవగా అందులోని నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, మంజుల, సంగీత్‌రెడ్డిలకు స్వల్పగాయాలయ్యాయి. బాధితులను 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అండగా చంద్రబాబు

చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ● పండగ వాతావరణంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన ప్రారంభోత్సవ కార్యక్రమం




సీఎం చంద్రబాబు కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న నాయకులు, రైతులు - రైతులకు మెగా చెక్కును అందిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో పండగ వాతావరణంలో జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. రైతు కుటుంబంలో పుట్టి.. రైతుల కష్టం తెలిసిన నాయకుడు చంద్రబాబు అన్నారు. ఏడాదికి రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చిన ఏడాదిలోనే మొదటి విడతగా రూ.7వేలను రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. టీడీపీ పుట్టిందే రైతులు, పేదల కష్టాలు తీర్చడానికని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రూ.4వేలు టన్నుకు రాయితీ ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. మామిడి రైతులకు అన్యాయం చేయాలని జిల్లాలోని కొంతమంది కుట్రలు పన్నారని, పరిశ్రమల యజమానులను బెదిరించారని అయినా ప్రభుత్వం రైతులకు న్యాయం చేసిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 20658మంది రైతులకు సంబంధించి రూ.7.52 కోట్ల అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల మెగా చెక్కును అందజేశారు. అనంతరం రైతులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, సురేంద్రకుమార్, కోదండయాదవ్, అధికారులు పాల్గొన్నారు.

క్లెయిమ్‌ల పరిష్కారంలో చిత్తూరు 'ఫస్ట్' : డీఆర్వో


రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన క్లెయిమ్‌ల పరిష్కారాల్లో రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డ్రాఫ్ట్ రేషనలైజేషన్-2026 ప్రక్రియపై జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన డీఆర్వో మాట్లాడుతూ.. ప్రస్తుతం 1776 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. 1200 ఓటర్లకు మించి ఉన్నచోట్ల అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిందని చెప్పారు. ఈ ప్రక్రియతో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1974కు చేరనుందన్నారు. మరమ్మతులకు గురైన, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కొనసాగుతున్న పోలింగ్ స్టేషన్లను అనువైన ప్రాంతాలకు మార్పుచేయడం జరుగుతుందని తెలిపారు. అనివార్యమైన ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల పేర్ల మార్పు కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, కుప్పం ఆర్డీవోలు శ్రీనివాసులు, శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, వెంకటశివ, విజయలక్ష్మి, వివిధ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్, అట్లూరి శ్రీనివాసులు, ఉదయ్ కుమార్, యశ్వంత్, పరదేశి, సురేంద్రబాబు, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజేంద్ర, ఐటీ విభాగ అధికారి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దన్నుగా కూటమి ప్రభుత్వం : ఎంపీ



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు దన్నుగా కూటమి ప్రభుత్వం నిలబడుతుందని ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిందన్నారు. దేశ ప్రధాని మోదీ సహకారంతో పీఎం కిసాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాలతో రైతులకు ఆదుకోవడం అభినందనీయమన్నారు. రైతులకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందించడం, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మేలు చేయడమేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46.86 లక్షల మంది రైతులకు ఈ పథకం కింద రూ.3174.43 కోట్లు లబ్ధి చేకూరనున్నట్లు వివరించారు. రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సేవలు అభినందనీయమని ఆ ప్రకటనలో ప్రశంసించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఐకమత్యంగా ప్రజలకు చేరువ కావాలన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్


మామిడి కొమ్మలను విరిచేసిన ఒంటరి ఏనుగు

కల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు హల్ చల్ చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం పరిసరాల్లో వారం రోజులుగా తిష్ట వేసిన ఒంటరి ఏనుగు శుక్రవారం రాత్రి కోటపల్లి వైపు అడుగులు వేసింది. చింతలవంక సమీపం నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కోటపల్లి వద్దకు చేరుకొని ఘీంకారాలు చేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామంలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడిచెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని తినేసింది. అనంతరం గ్రామంలోని రైతు బాబునాయుడుకు చెందిన పశుగ్రాసాన్ని ధ్వంసం చేసింది. అక్కడి నుంచి కల్లూరు-చిత్తూరు జాతీయ రహదారి ఎస్సార్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకుంది. సమీపంలోని జాతీయ రహదారిని దాటుకొని రిలయన్స్ టవర్ సమీపంలో పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకుంది. శనివారం పగలంతా గోగులమ్మ వంక పరిసరాల్లో ఒంటరి ఏనుగు తిష్ట వేసింది. కల్లూరు నుంచి గంటావారిపల్లి మార్గంలో వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవో శ్రీదేవి హెచ్చరించారు.




కళాకారులతో వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ తదితరులు - నృత్యం చేస్తున్న కళాకారిణులు

వైభవంగా కళా నివేదన

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయ పుష్కరిణి వద్ద శనివారం సాయంత్రం కళా నివేదన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శ్రీనృత్య నాట్య మండలి కళాకారుల భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఆలయ ఈవో పెంచలకిషోర్ సత్కరించారు. ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, త్రోబాల్ పోటీలు


క్రీడా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ జాతీయ క్రీడాకారులు

బంగారుపాళ్యం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 23, 24 తేదీల్లో జిల్లాస్థాయిలో గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈషా ఫౌండేషన్ సభ్యుడు స్వామిదక్షారి, వినోద్ తెలిపారు. శనివారం వారు కళాశాల క్రీడా మైదానంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాస్థాయిలో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన జట్లు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన జట్లు సెప్టెంబరు 21వ తేదీన కోయంబత్తూరులో జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వాలీబాల్, త్రోబాల్ జట్లకు మొదటి బహుమతిగా రూ.10వేలను, రెండో బహుమతిగా రూ.7వేలను, మూడో బహుమతిగా రూ.5వేలను, నాల్గవ బహుమతిగా రూ.3వేలను ఇస్తారన్నారు. జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 లక్షలు బహుమతిగా లభిస్తుందని చెప్పారు. ఈ పోటీలకు గ్రామీణ మహిళలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. గ్రామానికి చెందిన క్రీడాకారులు మాత్రమే ఒక జట్టుగా పాల్గొనాలని సూచించారు. అంతకుముందు క్రీడలకు సంబంధించిన పోస్టర్లను ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులు తులసీరెడ్డి, ఎంబీ కుమార్ రాజా, ఎంబీ కృష్ణమూర్తి, డీఎస్‌డీవో బాలాజి, కామరాజు, పరదేశి ఆవిష్కరించారు.


రఘుపతిని సత్కరిస్తున్న సహచర కళాశాల ప్రిన్సిపాళ్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతమే లక్ష్యం

ఇన్‌చార్జి డీఐఈవో రఘుపతి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేయడమే లక్ష్యమని ఇన్‌చార్జి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) రఘుపతి అన్నారు. శనివారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుత్తూరుకు చెందిన తాను 1996లో మహబూబ్‌నగర్ జిల్లా నాగర్ కర్నూలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరానని చెప్పారు. ఆపై రైల్వే కోడూరు, పిచ్చాటూరు, నగరిలో పనిచేసి.. ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై సత్యవేడు జూనియర్ కళాశాలకు వచ్చానన్నారు. నగరి, పుత్తూరులో పనిచేశానని, వరదయ్యపాళ్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నుంచి ఇన్‌చార్జి డీఐఈవోగా పదోన్నతి పొందినట్లు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో కంటే పదిశాతం ఎక్కువ అడ్మిషన్లు చేయించడానికి కృషి చేస్తానన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్ల, అధ్యాపకులతో సమన్వయం చేసుకుంటూ బోధనపరంగా పురోగతి సాధించడానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రైవేటు కళాశాలల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రఘుపతిని జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు దయానందరాజు, సయ్యద్ మౌల, హేమలత, శరత్‌చంద్ర, రెడ్డెప్ప తదితరులు అభినందించారు.

ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు డైరెక్టర్‌గా నాగేశ్వరరాజు


నాగేశ్వరరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు రాష్ట్ర డైరెక్టర్‌గా చిత్తూరు పార్లమెంటు తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు, కార్వేటినగరం మండలం రాజులకండ్రిగకు చెందిన నగలపాటి నాగేశ్వరరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీఆర్ రాజన్, కోదండయాదవ్ అభినందించారు.

ఏపీ సర్వోదయ జిల్లా నూతన కమిటీ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ సర్వోదయ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాద్‌బాబు, రెప్రజెంటేటివ్‌గా నటరాజ్, ప్రధాన కార్యదర్శులుగా క్రిస్టి, దాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమాదేవి, జాయింట్ సెక్రటరీగా ప్రసాద్, ట్రెజరర్‌గా పుష్పరాజ్, పీఆర్వోగా సుధాకర్, మెంబర్లుగా దివ్యభారతి, అబ్రహాం, మునిరత్నంలను ఎన్నుకున్నట్లు తెలిపారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా కమిటీ పనిచేస్తుందని, జిల్లాలో భూములను గుర్తించి, వాటిని భూముల్లేని పేదలకు పంపిణీ చేసేలా పోరాటం చేయనున్నట్లు చెప్పారు.

ఏనుగు దాడి బాధితుడికి పరిహారం పంపిణీ



బాధితుడికి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, ఎఫ్ఆర్వో తదితరులు

కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలో ఏనుగు దాడిలో గాయపడిన వి.కృష్ణమూర్తి అనే రైతుకు అటవీ శాఖ మంజూరు చేసిన నష్టపరిహారాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శనివారం అందజేశారు. శాంతిపురం మండలం తులసినాయనిపల్లె గ్రామ రైతు కృష్ణమూర్తి తన పొలం వద్ద కాపలా ఉన్న సమయంలో గుడిసెలో ఉన్న ఆయనపై ఏనుగు దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన 2024 సంవత్సరం ఏప్రిల్‌లో జరిగింది. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో బాధితుడైన రైతు కృష్ణమూర్తికి అటవీ శాఖ మంజూరు చేసిన నష్టపరిహారం రూ.1.87 లక్షల విలువ కలిగిన నగదు చెక్కును ఎమ్మెల్సీ కంచర్ల అందజేశారు. కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి ఆర్.జయశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో మురుగు కాలువ నిర్మాణానికి వినతి



కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 19వ వార్డులో మురుగు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము ఎమ్మెల్సీ కంచర్లకు వినతిపత్రం అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసిన దాము మాట్లాడుతూ మురుగునీటి కాలువ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మురుగ కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ కంచర్ల మున్సిపల్ అధికారులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు ధ్యేయం



కెంచనబల్లలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న పట్ర నారాయణాచారి

రామకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి తెలిపారు. శనివారం రామకుప్పం మండలంలో కెంచనబల్లలో ఆయన కొత్త లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మునిరెడ్డి, సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డుసభ్యుడి మృతి



వెంకటపతి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ బూరుగుమాకులపల్లెకు చెందిన టీడీపీ వార్డు సభ్యుడు వెంకటపతి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ యూనిట్ కో-ఇన్‌చార్జి రెడ్డిపురుషోత్తం, బూత్‌కన్వీనర్ వెంకటాచలం శనివారం స్థానిక నేతలతో కలిసి వెంకటపతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు రమేష్, చంద్రకుమార్, సుబ్రహ్మణ్యం, జయచంద్ర, చిన్నసురేష్, ఉదయ్‌భాస్కర్, చిన్నజబ్బీర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శనివార పూజలు



విశేష అలంకరణలో పద్మావతి, వేంకటేశ్వరస్వామి

రామకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణమాస రెండో శనివార పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయ పూజారులు అమ్మవారు, శ్రీవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకొని అర్చనలు చేయించారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామి, శనీశ్వరస్వామి ఆలయాలు భక్తులో కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు

రాజనాల బండలో...



చౌడేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే రాజనాల బండపై వెలసిన అభయ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే చౌడేపల్లిలో కొలువుదీరిన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలోని శేషాద్రిస్వామి ఆలయం, పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయం, కడపనత్తం నలగుంద్రాయస్వామి ఆలయం, మురారిపల్లె ఓబులేశ్వర స్వామి ఆలయాల్లో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకాలు చేసి పూజలు చేశారు. ఉభయదారులు ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

ముగిసిన పాలేటమ్మ గ్రామోత్సవాలు



సోమల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి జాతర సందర్భంగా శనివారం గ్రామోత్సవాలు ముగిశాయి. అంతకు ముందు సోమల ప్రభుత్వ కాలనీలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. అనంతరం పాలేటమ్మవారి ఆలయానికి అమ్మవారు చేరుకున్నారు. ఆలయం వద్ద మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు.

రేపు మండల సచివాలయంలో పీజీఆర్ఎస్

కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన బాధ్యులైన అధికారులు హాజరవుతారన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను విన్నవించి పరిష్కారాలు పొందాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అప్రమత్తంగా ఉండాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

గంగవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందించాలని గంగవరం ఎంపీడీవో టీజీవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి సమాచార హక్కు చట్టం నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టంతో వ్యక్తిగత సమాచారం కోరితే అలాంటి వాటిని నిబంధనల ప్రకారం తిరస్కరించవచ్చన్నారు. విషయాన్ని గుర్తించి సచివాలయ సిబ్బంది సమాచార హక్కు చట్ట నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సందేహం వస్తే మండల అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో నటరాజన్

సదుం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లె, కురవపల్లెలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు ఎన్ఆర్ఐ, ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుమలత విద్యాసామగ్రి వితరణగా అందించారు. ఎంఈవో నటరాజన్ చేతుల మీదుగా శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఊరిపై మమకారంతో అమెరికాలో స్థిరపడిన సుమలత ఏటా పీలేరు, సదుం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి, ఆట వస్తువులు అందించడం అభినందనీయమని తెలిపారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొత్త పింఛన్లు అందజేస్తున్న విండో అధ్యక్షుడు హరిప్రసాద్

చౌడేపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని చౌడేపల్లి టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దకొండామర్రి సచివాలయంలో అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులతో కలిసి తిలకించారు. అలాగే చౌడేపల్లి సింగిల్‌విండో కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లు సింగిల్‌విండో అధ్యక్షుడు పగడాల హరిప్రసాద్ టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రమౌళి, కుమార్‌రెడ్డి, కార్తీక్, సాగర్ పాల్గొన్నారు.

సోమల మండలంలో...

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కందూరు సచివాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఇరికిపెంటలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సోమలలో సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, స్థానిక టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్ని కార్యక్రమాలను తిలకించారు.

రహదారి సమస్య పరిష్కరించాలని ధర్నా



రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శనివారం పలమనేరు రహదారిపై ధర్నా చేపట్టారు. కొన్నేళ్లుగా నాగిరెడ్డిపల్లెకు వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. పోలీసులు చేరుకుని నచ్చజెప్పి పంపారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబారం

సోమల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు రైతు సేవాకేంద్రం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా ఆలయంలో శనివారం ఆలయ ధర్మకర్త పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈక్రమంలోనే భాగవతారణి గీతాశ్రీ శ్రీకృష్ణ రాయబారం ఘట్టాన్ని ఆలపించారు. ఉభయదారులు టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబసభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మోదుగులపల్లె సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన పుంగనూరు సమీపంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని మోదుగులపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు సోమశేఖర్(45) భార్య సౌమ్య ద్విచక్రవాహనంలో పట్టణంలోని ఆలయానికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా భీమగానిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు రామ్‌చరణ్(16) ద్విచక్రవాహనంలో వేగంగా వెళ్లి సోముశేఖర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా వారి పరిస్థితి ఆందోళనంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అన్నదాతకు అండగా సీఎం చంద్రబాబు



కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కంచర్ల, నాయకులు



అన్నదాత సుఖీభవ మెగా చెక్ అందజేస్తున్న జేసీ విద్యాధరి తదితరులు

కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాతలకు అండగా, అన్నగా నిలబడుతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. కుప్పం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని వారు శనివారం ప్రారంభించారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఈ సందర్భంగా జరిగిన సభలో రైతు సోదరులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎంలు మాట్లాడుతూ రైతు జీవితాలు వారు పండించే పంటల్లా నిత్యం ఆకుపచ్చగా సుఖసంతోషాలతో కళకళలాడుతూ ఉండాలన్నది సీఎం ధ్యేయమన్నారు. అందుకే అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చి రైతుల అకౌంట్లలో నగదు జమ చేశారని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజకవర్గంలోని మొత్తం 36,368 మంది లబ్ధిదారులైన రైతులకు రూ.23.9 కోట్లను వారి అకౌంట్లలో జమ చేశారు. కుప్పం మండలంలో 12,836 మంది రైతులకు రూ.8.14 కోట్లు, గుడుపల్లెలో 6,533 మంది రైతులకు రూ.4.36 కోట్లు, రామకుప్పంలో 7,983 మంది రైతులకు రూ.5.43, శాంతిపురం మండలంలో 9,016 మంది రైతులకు రూ.6.022 కోట్లు అకౌంట్లలో జమయ్యాయి.

కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, నాయకులు డాక్టర్ వెంకటేశ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్ఎస్.తులసీనాథ్, జనసేన ఇన్‌చార్జి నరేశ్‌లతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు మండలంలోని 38,368 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ప్రభుత్వం సాయం అందిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. పలమనేరు మండలం పెంగరగుంట గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ కింద నియోజకవర్గ స్థాయిలో జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు అందిస్తుందన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ మెగా చెక్‌ను డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డితో కలిసి మహిళా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో పి.భవాని, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలమనేరు, గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, సోమశేఖర్‌గౌడు, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గణేష్, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జగదీష్‌నాయుడు, జనసేన పలమనేరు రూరల్ అధ్యక్షులు నాగార్జున, పీఏసీఎస్ చైర్మన్లు, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- పలమనేరు మార్గంలోని గురివిరెడ్డిపల్లె వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలిలా... పెద్దపంజాణి మండలం గురివిరెడ్డిపల్లెకి చెందిన రామచంద్రారెడ్డి(70) పాల క్యాన్ ద్విచక్రవాహనంలో తీసుకెళుతుండగా గురివిరెడ్డిపల్లె క్రాస్‌లో పుంగనూరు మండలం కుమ్మరనత్తం పంచాయతీ కపాడమిట్టపల్లెకు చెందిన ప్రకాశ్, రెడ్డెప్పలు ద్విచక్రవాహనంతో ఢీకొనడంతో రామచంద్రారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన రామచంద్రారెడ్డిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కస్తూర్బా పాఠశాలలో వసతుల తనిఖీ



కస్తూర్బా పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కస్తూర్బా పాఠశాల వసతులపై జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పరిశీలించి అక్కడి స్థితిగతులపై ఆరా తీశారు. శనివారం పట్టణ సమీపంలోని నక్కబండలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, విద్యుత్ లైట్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యాబోధనపై ఆరా తీశారు. బాలికల్లో క్రమశిక్షణ పెంచాలని, మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాతిమా, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మునీంద్రనాయక్, రామయ్య, చిన్నరాయుడు, అయూబ్‌ఖాన్, రెడ్డినాయక్, రామకృష్ణ, మణి పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ పరిశీలన

సోమల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోని చెత్తను వీధుల్లో ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బండిలోనే వేయాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. సోమల, కందూరులో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను శనివారం పరిశీలించారు. చెత్త పేరుకు పోవడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సోమల వారపుసంతలో నిత్యం మద్యం తాగి బాటిళ్లు అక్కడే పడేయడం తో ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

శ్రావణ శనివారంతో కిటకిటలాడిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో శనేశ్వరస్వామి

పుంగనూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక కోనేరు వద్ద గల కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో స్వామి వారికి అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అద్దాల మండపంలో ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రావణమాసం కావడంతో పుంగనూరు, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, టీడీపీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ సమీపంలోని పుంగమ్మ చెరువు, దండుపాళ్యం మార్గంలో వెలసిన శనేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఆలయాలను శుద్ధి చేసి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బంగారుపాళ్యం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తంబుగానిపల్లెకి చెందిన మధుసూదన నాయుడు(37) చేసిన అప్పులు తీర్చలేక గ్రామసమీపంలోని ఓ మామిడి తోటలో చెట్టు కొమ్మకు ఉరేసుకున్నాడు. ఇతను రూ.35 లక్షల మేర అప్పులు చేసినట్లు పోలీసులు తెలిపారు. భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వరసిద్ధుడి అన్నదానానికి విరాళం



ఈవోకు చెక్కు అందిస్తున్న దాత తోట శ్రీహరి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి శనివారం బెంగళూరుకు చెందిన వెంకటదినకర్ రూ.లక్ష, తిరుపతికి చెందిన తోటశ్రీహరి రూ.2,00,002లను విరాళమిచ్చారు. ఈ మొత్తాలకు సంబంధించిన చెక్కులను ఆలయ ఈవో పెంచలకిషోర్‌కు దాతలు అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు,చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రడిహుదార శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు.

ఆత్మస్థైర్యమే ఆడపిల్లలకు రక్షణ కవచం



హరికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుడిపాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యమే ఆడ పిల్లలకు రక్షణ కవచమని ప్రముఖ కవి, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి అన్నారు. శనివారం సీఎస్ఆర్ కళాశాల, నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిత కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధినేత లోకేష్‌రెడ్డి, నరహరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం దూర్వాసులు, అధ్యాపకుడు అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎద్దులబండిపై మంత్రి సందడి



రొంపిచెర్లలో జరిగిన 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమానికి ఎద్దుల బండిపై వస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి

పసిపిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరం



బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పూజిత

రామకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పసిపిల్లలకు తల్లి పాలు తాగించడమే శ్రేయస్కరమని రామకుప్పం మండలం విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని రెడ్డివానిపోడు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు తల్లి పాలు విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అర్ధ గంటలోపు తల్లిపాలు పట్టాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఏ బాలు, హెచ్ఈ ప్రమీళ, ఎంఎల్‌హెచ్‌పీలు లావణ్య, కావ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, పలువురు ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **సదుం:** శిశువుల్లో రోగనిరోధక శక్తికి తల్లి పాలు ప్రాధాన్యతపై బాలింతలు, గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1 నుంచి 8 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వాణిశ్రీ దేవి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్


సీఎం చంద్రబాబు చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేస్తున్న థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. శనివారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన ప్రారంభ కార్యక్రమానికి ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్, కూటమి నాయకులతో కలసి థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా ఒక్కో రైతుకు రూ.7వేల చొప్పున జమ చేయడం జరిగిందని చెప్పారు. నియోజకవర్గంలో 36047 మంది రైతులకు రూ.24,32,63,000లను తొలి విడతగా ఇచ్చామన్నారు. దీనికి సంబంధించిన మెగా చెక్కును రైతులకు అందజేశారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చించా: గంగాధరనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ సుమిత్ కుమార్‌తో గంటపాటు చర్చించానని రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ శనివారం తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధే తన అజెండా అన్నారు.

జాతీయ చేనేత దినం ప్రకటన హర్షణీయం: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినంగా ఆగస్టు 7వ తేదీని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం హర్షణీయమని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దినాన్ని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం ఏడో తేదీనుంచి మగ్గాలకు ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుడుతూ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

ఉత్తమ పీఏసీఎస్‌గా 'కోసలనగరం'

విజయపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరం ఉత్తమ పీఏసీఎస్‌గా నిలిచిందని చైర్మన్ మందాటి బాబుయాదవ్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక లావాదేవీల పరంగా ఉత్తమ సొసైటీగా ఎంపికైనదన్నారు. సోమవారం విజయవాడ గవర్నర్‌పేటలోని మక్కినేని బసవయ్య విజ్ఞాన కేంద్రంలో చైర్మన్, సీఈవో చంద్రమోహన్ యాదవ్‌ను సత్కరిస్తున్నట్టు తెలిపారు.

వన వేణుగోపాలుడికి పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

దుర్గాంబ హుండీ ఆదాయం రూ.3.28లక్షలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దుర్గాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.3,28,628 లభించినట్లు ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. శనివారం హుండీని లెక్కించగా ఈ మేరకు ఆదాయం సమకూరిందన్నారు. పాలక మండలి చైర్మన్ దిలీప్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్, అర్చకుడు జగదీశ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'స్వామిత్వ' సర్వేపై అవగాహన

గంగాధరనెల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లేపల్లెలో సర్పంచ్ గంగయ్య యాదవ్ అధ్యక్షతన స్వామిత్వ సర్వేపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, టీఎన్‌టీయూసీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు దేవరాజులునాయుడు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ అసిస్టెంట్ ఢిల్లీబాబు, మాజీ ఉప సర్పంచ్ వెంకటపతిరెడ్డి, టీడీపీనేత త్యాగరాజులురెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కోసం ధర్నా


రహదారిపై బైఠాయించిన విద్యార్థులు, గ్రామస్తులు

యాదమరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు సక్రమంగా రావడం లేదని విద్యార్థులతో కలిసి పత్రపల్లె గ్రామస్తులు శనివారం రహదారిపై ధర్నాకు దిగారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పత్రపల్లె, గొందివాళ్లఊరు విద్యార్థుల సౌకర్యార్థం నడిచే ఆర్టీసీ బస్సు వారంరోజులుగా సక్రమంగా రావడం లేదన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. దాంతో చిత్తూరు- గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి పత్రపల్లె క్రాస్ వద్ద ధర్నా చేపట్టారు. విషయం చిత్తూరు డిపో మేనేజర్ కృష్ణమూర్తికి తెలియడంతో వెంటనే బస్సును పంపడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. ఈ విషయమై డీఎం మాట్లాడుతూ.. రెండ్రోజులుగా విద్యార్థులు సక్రమంగా రాకపోవడంతో డ్రైవర్ గొందివాళ్లవూరుకు కాకుండా పత్రపల్లె క్రాస్‌రోడ్డు నుంచి వెనుదిరిగాడన్నారు. దీనిపై ఆ డ్రైవర్‌కు ఛార్జ్ మెమో ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇకపై సర్వీసును రోజూ పంపుతామని తెలిపారు.

ఐరాల హైస్కూల్ అభివృద్ధికి కృషి చేద్దాం

● పూర్వ విద్యార్థుల సంఘం


సమావేశంలో ప్రసంగిస్తున్న సీతాపతినాయుడు

ఐరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఐరాల హైస్కూల్ అభివృద్ధికి కృషి చేద్దామని పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సీతాపతినాయుడు పిలుపునిచ్చారు. శనివారం పాఠశాల వజ్రోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. అనంతరం గత ఏడాది టెన్త్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదును బహూకరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కేఎస్ఎస్ శేషన్, సీనియర్ అడ్వొకెట్ ఆదినారాయణ, ఎంపీడీవో ధనలక్ష్మి, కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'సుపరిపాలన'లో నగరి వెనుకబాటుకు కారకులెవరు?

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నగరి నియోజకవర్గం వెనుకబడటానికి కారకులెవరని టీడీపీనేత రామానుజం చలపతి ప్రశ్నించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగరి నియోజకవర్గంలో ఇప్పటివరకు టీడీపీ కమిటీలు వేయకపోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానం, నియోజకవర్గ పరిశీలకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాజీ కౌన్సిలరు లత, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కల్వర్టును బాగు చేయండి


ప్రమాదకరంగా మారిన కల్వర్టు

చిత్తూరురూరల్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మిట్టూరులోని రంగారెడ్డి వీధికి వెళ్లే మార్గంలో కాలువపై ఉన్న కల్వర్టు కుంగిపోయింది. ఈ కాలువపై వేసిన బండరాళ్లు కదిలిపోయాయి. దీనివల్ల ఇక్కడ వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట ద్విచక్ర వాహనదారులైతే తరచూ గాయాలపాలవుతున్నారు. ఇప్పటికే నలుగురు ప్రమాదాల బారినపడ్డారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బంగారుపాళ్యం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తంబుగానిపల్లెకి చెందిన మధుసూదన నాయుడు(37) చేసిన అప్పులు తీర్చలేక గ్రామసమీపంలోని ఓ మామిడి తోటలో చెట్టు కొమ్మకు ఉరేసుకున్నాడు. ఇతను రూ.35 లక్షల మేర అప్పులు చేసినట్లు పోలీసులు తెలిపారు. భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పింగళి వెంకయ్యకు నివాళి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులెక్కడ?


మట్టి దిబ్బలుగా ఉన్న రోడ్లు, కనిపించని కాలువలు - వెలగని వీధి దీపాలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టు నుంచి చెర్లోపల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కరువయ్యాయి. ఈ కాలనీ ఏర్పడి ఇప్పటికి 18 ఏళ్లయినా రోడ్లు, కాలవులు, తాగునీరు, వీధి లైట్లు వంటి సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సుమారు 30 వీధులకు

ఇబ్బంది పడుతున్న స్థానికులు

పైగా ఉన్నాయి. నివాసం ఉండేవారిలో చాలా మంది దినకూలీలు, మధ్యతరగతి వారే. వైసీపీ ప్రభుత్వంలో మురకంబట్టు నుంచి చెర్లోపల్లె (తిరుపతి- బెంగళూరు) బైపాస్ రోడ్డు వరకు సుమారు 5 కి.మీ నేషనల్ హైవే ఆధ్వర్యంలో డబుల్ లైన్ రోడ్డు నిర్మించారు. మురుకంబట్టు నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలైతే ఏర్పాటు చేశారు. అవి ఇంత వరకు వెలగలేదు. రాత్రిపూట ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల పక్షపాతి చంద్రబాబు

● ఎమ్మెల్యే భానుప్రకాష్


రైతులకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరి వ్యవసాయ కార్యాలయ ఆవరణలో జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం పలుపథకాలను చంద్రబాబు ప్రవేశ పెట్టారని చెప్పారు. పోగాకు,మిర్చి రైతులను ఆదుకున్నారన్నారు. నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో 20,063 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. పీఎం కిసాన్ ద్వారా 16881 మంది రైతులకు రూ.337.89 లక్షలు, అన్నదాత సుఖీభవ కింద 20,063 మంది రైతులకు రూ.1003.6 లక్షల నగదు జమ అయినట్లు వివరించారు. వ్యవసాయ సంచాలకులు కవిత, వ్యవసాయాధికారులు రాఘవేశ్వర్‌యాదవ్, రజనీకుమారి, తులసీరామ్, కోదండయ్య, విజయ్‌కుమార్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్లు బాలాజీ, వెంకటేశ్వరరావు, నాయకులు రమేష్‌బాబు, రమేష్‌రాజు, మీరా, కృష్ణారెడ్డి, ఎం.వి.శ్రీనివాసులు, జ్యోతినాయుడు, సురేష్‌నాయుడు, జీవరత్నంనాయుడు, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

● ఎమ్మెల్యే మురళీమోహన్


రైతులకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో 'అన్నదాన సుఖీభవ, పీఎం కిసాన్ యోజన' మొదటి విడత నిధుల జమ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని వేలాదిమంది రైతుల ఖాతాల్లో రూ.23 కోట్లు జమ కానుందని చెప్పారు. దీనివల్ల రైతులు అప్పులబాధల నుంచి కొంతవరకు విముక్తి పొందుతారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, సింగిల్ విండో చైర్‌పర్సన్ చిత్రా నాయుడు, డైరెక్టర్లు మహబూబ్ బాషా, ప్రభాకర్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, బంగారుపాళ్యం ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, డైరెక్టర్లు హరినాయుడు, మోహన్, సర్పంచ్‌లు హేమయ్య నాయుడు, భగవతి, జనసేన అధ్యక్షుడు కుమార్, నాయకులు హేమగిరి, అమరనాథ నాయుడు, గోపిగౌడ్, గుణశేఖర్, మాధవ నాయుడు, వేణు నాయుడు, ధరణి ప్రకాష్, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఏవో దీప, ఏపీవో సంధ్యారాణి, మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ


లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న గంధమనేని రాజేష్

నిండ్ర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒరూరుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వితంతువులకు నూతనంగా మంజూరైన పింఛన్లను టీడీపీ నాయకుడు గంధమనేని రాజేష్ శనివారం పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. నాయకులు గిరినాయుడు, గజేంద్రనాయుడు, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: దళితవాడలోనూ వితంతువులకు మంజూరైన పింఛన్లను తెలుగు యువత కపిల్, శ్యామువేలు, జాన్ తదితరులు పంపిణీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగల చోరీ

పూతలపట్టు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగలను చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామాపురం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమ పొలాల వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు ఆ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి, అందులోని రాగి తీగలను చోరీ చేశారు. రైతుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయాలకు నూతన పాలక వర్గాలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడు ఆలయాలకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వంనియమించింది. ఈమేరకు ఆలయాల ఈవో వెంకట్రాయలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామాక్షి అంబికాసమేత అగస్తీశ్వరాలయ చైర్మన్‌గా ఎన్.చంద్రశేఖర్,సభ్యులుగా బి.మౌనిష, వి.శ్యామల. టీజీ మురుగేష్, టి.మాధురి, పీఏ బాలసుబ్రమణ్యం, బీఎన్ రాజేష్, ఎన్ఎస్ ఇన్నవల్లి, ఎక్స్ అఫిసియో మెంబరుగా శివకుమార్ నియమితులయ్యారు. తేనెబండ ముత్యాలమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్‌గా ఆర్.యుగంధర్ బాబు, సభ్యులుగా ధరణికుమార్, గణేశ్, కె.చంద్రశేఖర్, ఎస్.శాంతి, టి.మూర్తి, ఎస్.రాణి, ఎల్.భాగ్యవతి, నదియాలను నియమించారు. శివ షణ్ముగ సుందర వినాయక స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా వి.కన్నన్, సభ్యులుగా పి.లక్ష్మి, ఆర్ఎల్ విజయరాఘవులు, సీవీ భాస్కర్, డి.శ్రీలక్ష్మి, ఎం.సుధ, ఎస్.రాధిక, సుజన, ఎక్స్ అఫిసియో సభ్యుడిగా శ్రీధర్ అయ్యర్ నియమితులయ్యారు.

గుడిపాలలో ఆగని ఆర్టీసీ బస్సులు

● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

గుడిపాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుడిపాలలో రాత్రి సమయాల్లో తిరుమలకెళ్లే ఆర్టీసీ బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలూరు టిక్కెట్లనే ఎక్కించుకుంటున్నారని తెలిపారు. అలాగే వేలూరు నుంచి చిత్తూరు వైపు వచ్చే బస్సుల్లో సైతం ఇదే పరిస్థితి ఉంటోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా 350 సీట్లు

● అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 350 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గంగాధరనెల్లూరు ఏఎస్‌డబ్ల్యువో వి.షకీల తెలిపారు. సీట్లవారీగా.. గంగాధరనెల్లూరు బాలుర హాస్టల్లో 50, బాలికల హాస్టల్లో 45,చతూగుండ్రంలో బాలుర హాస్టల్లో 60, పూతలపట్టు బాలుర హాస్టల్లో 20, పి.కొత్తకోట బాలుర హాస్టల్లో 30, పెనుమూరు బాలుర హాస్టల్లో 60, ఉగ్రాణంపల్లె బాలుర హాస్టల్లో 40, శ్రీరంగరాజుపురం మండలం కొత్తపల్లెమిట్ట బాలుర హాస్టల్లో 45 ఖాళీలు ఉన్నాయని ఒక ప్రకటనలో వివరించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ కులాలకు చెందిన పేదవిద్యార్థులు మూడు నుంచి పదో తరగతి వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జూనియర్ కళాశాలలో తనిఖీలు


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

వెదురుకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం జడ్పీ జూనియర్ కళాశాలను ఎంఈవో దామోదరంతో కలసి ఎంపీడీవో పురుషోత్తం శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. వారి వెంట గ్రామ కార్యదర్శి వెంకటేశులు, ఉద్యోగులు ఉన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.3 లక్షల విరాళం


ఈవో పెంచలకిషోర్‌కు చెక్కు అందిస్తున్న శ్రీహరి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి శనివారం బెంగళూరుకు చెందిన వెంకట దినకర్ రూ.లక్ష, తిరుపతికి చెందిన తోటశ్రీహరి రూ.2,00,002లను విరాళమిచ్చారు. ఈ మొత్తాలకు సంబంధించిన చెక్కులను ఆలయ ఈవో పెంచలకిషోర్‌కు దాతలు అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు,చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రడిహుందార శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు.

వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న రామభద్ర

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులను గణేశ ఉత్సవ నగర కమిటీ సభ్యుడు రామభద్ర కోరారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గణేశుడి విగ్రహాల నిమజ్జనాలకు అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. సమావేశంలో వెంకటేష్, సిద్ధు, జయచంద్ర, హేమంత్, సునీల్, బాలాజీ, భాస్కర్, జ్యోతి, నందు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం రిజర్వాయర్ కాలువల పరిశీలన


రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ ఎస్ఈ తదితరులు

వెదురుకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలను శనివారం ఇరిగేషన్ ఎస్ఈ కె.వెంకటరాజు, డీఈఈ వరప్రసాదరెడ్డి, ఏఈఈ పీఎస్ భాస్కర్‌రాజీవ్ పరిశీలించారు. అభివృద్ధి పనులపై చర్చించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

టీడీపీ కార్యక్రమాలను సక్సెస్ చేయాలి/ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే జగన్మోహన్ సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం అమలుపై శనివారం నియోజకవర్గంలోని క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో దాదాపు పూర్తిచేసినా, యాప్‌లో అప్లోడ్ చేయకపోవడంతో రాష్ట్రస్థాయిలో వెనుకబడి ఉన్నామన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ప్రజలతో క్షేత్రస్థాయిలో మమేకమై పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు వివరించాలని చెప్పారు. మేయర్ అముద, పార్టీ అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు, ఎల్లుండి 'ఉరుసు'

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రోడ్డులో ఉన్న సయ్యద్ షా గులాం రసూల్ సాహెబ్ (బాబా) ఉరుసు మహోత్సవాన్ని సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకుడు షాజహాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు ఉంటుందన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

వెదురుకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాయితీపై అందించే పెరటి కోళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. శనివారం కార్వేటినగరంలో వెలుగు ఏపీఎం కవిత ఆధ్వర్యంలో పెరటి కోళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

14 మందికి నూతన పింఛన్లు



లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న అమరనాథ నాయుడు

యాదమరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లె పంచాయతీలో 14మంది వితంతువులకు నూతన పింఛన్లు మంజూరయ్యాయి. వారికి ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర, సర్పంచ్ దానియేలు, పంచాయతీ కార్యదర్శి దివ్య, మాజీ సర్పంచ్ హరినాయుడు, రఘునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యమే రక్షణ కవచం


హరికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు

గుడిపాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యమే ఆడ పిల్లలకు రక్షణ కవచమని ప్రముఖ కవి, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి అన్నారు. శనివారం సీఎస్ఆర్ కళాశాల, నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిత కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధినేత లోకేష్‌రెడ్డి, నరహరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం దూర్వాసులు, అధ్యాపకుడు అర్జున్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవకు నివాళి


బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాటకరంగ ప్రముఖుడు బళ్లారి రాఘవ జయంతి కార్యక్రమాన్ని పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ మణికంఠ పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్, పీజీఆర్ఎస్ సీఐ నాగరాజు, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్, ఏవో నాగభూషణమ్మ పాల్గొన్నారు.

ఏనుగు దాడి బాధితుడికి పరిహారం పంపిణీ

కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలో ఏనుగు దాడిలో గాయపడిన వి.కృష్ణమూర్తి అనే రైతుకు అటవీ శాఖ మంజూరు చేసిన నష్టపరిహారాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శనివారం అందజేశారు. శాంతిపురం మండలం తులసినాయనిపల్లె గ్రామ రైతు కృష్ణమూర్తి తన పొలం వద్ద కాపలా ఉన్న సమయంలో గుడిసెలో ఉన్న ఆయనపై ఏనుగు దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన 2024 సంవత్సరం ఏప్రిల్‌లో జరిగింది. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో బాధితుడైన రైతు కృష్ణమూర్తికి అటవీ శాఖ మంజూరు చేసిన నష్టపరిహారం రూ.1.87 లక్షల విలువ కలిగిన నగదు చెక్కును ఎమ్మెల్సీ కంచర్ల అందజేశారు. కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి ఆర్.జయశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.